క్లుప్తంగా

నేడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందన

నరసాపురం: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తారు. ఉదయం 10.30 గంటల నుంచి ప్రజల నుంచి ఫిర్యాదులు, విజ్ఞప్తులను సబ్‌కలెక్టర్ ఎం.సూర్యతేజ స్వీకరిస్తారని సబ్‌కలెక్టర్ కార్యాలయ వర్గాలు ఆదివారం విలేకరులకు తెలిపారు. డివిజన్ స్థాయి అధికారులంతా అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ దరఖాస్తులు అందించాలని కోరారు.

ఆక్యుపంక్చర్ వైద్యంతో ఉపయోగం



ఆక్యుపంక్చర్ వైద్యసేవలు అందిస్తున్న దృశ్యం

నరసాపురం: ఆక్యు పంక్చర్ వైద్యంతో సయాటికా, కీళ్ల నొప్పులు వంటి దీర్ఘకాల వ్యాధుల నుంచి ఉపశమనం పొందవచ్చని ప్రముఖ వైద్యుడు డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ అన్నారు. ఆదివారం స్థానిక తెలగ కల్యాణ మడపంలో కొవ్వలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో టీఎస్ఆర్ ఫిజియోథెరపి వారి సహకారంతో ఆక్యుపంక్చర్, నేచురోపతి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన డాక్టర్ చినిమిల్లి మాట్లాడుతూ ఆక్యుపంక్చర్ వైద్యం ప్రాచీనమైందని, చైనాలో ఎక్కువ ప్రాచుర్యం పొందిందని చెప్పారు. సుమారు 200 మందికి వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో కొవ్వలి పౌండేషన్ ప్రతినిధులు జయలక్ష్మి, సంకు భాస్కరనాయుడు, ఆరేటి వేణు, కోటిపల్లి కన్నబాబు పాల్గొన్నారు.

రామాలయంలో ధనుర్మాస పూజలు



రామాలయంలో పూజలు చేస్తున్న మహిళలు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక బుధవారపు వీధి రామాలయంలో ధనుర్మాసపూజలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక హారతులు ఇచ్చారు. స్వామి వారికి అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు 24వ పాశురవిన్నపాన్ని ఆలపించారు. ఆలయ నిర్వాహకులు శ్రీఖాకొల్లు వెంకన్న, విన్నకోట రంగనాయకులు, అర్చకుడు ఆచార్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

తూర్పుకాపు ఐక్య కమిటీ పట్టణ అధ్యక్షుడిగా వాసు



తూర్పుకాపు ఐక్య కమిటీ నూతన సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: పట్టణ తూర్పుకాపు ఐక్య కమిటీ పట్టణ అధ్యక్షుడిగా గేదెల శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం తూర్పుకాపు సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షునిగా గేదెల శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షులుగా కోరాడ శ్రీనివాసరావు, బెజ్జవరపు నాగరాజులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మీసాల రాము, లోపింటి చిరంజీవి, పిల్లా సత్తిబాబు, బాకూరి నిరంజన్, జమ్ము కాశి, చీర సత్తిబాబు, పొట్నూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గీతా ముఖర్జీకి ఘన నివాళి



గీతా ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

సాక్షి, భీమవరం: సమసమాజ స్థాపనే లక్ష్యంగా అలుపెరుగని పోరాటాలు సాగించిన కమ్యూనిస్టు యోధురాలు గీతా ముఖర్జీ ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు కోరారు. ఆదివారం స్థానిక శ్రీనివాస్ థియేటర్ సెంటర్లో సీపీఐ స్తూపం వద్ద గీతా ముఖర్జీ శతజయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ 15 ఏళ్ల చిన్న వయస్సులోనే సీపీఐలో చేరి స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని జైలు జీవితం గడిపారన్నారు. బెంగాల్ శాసనసభకు సభ్యురాలుగా, అనేక పర్యాయాలు పార్లమెంటు సభ్యురాలిగా పనిచేశారన్నారు. సమస్యలపై తన గళాన్ని విప్పి పార్లమెంట్ నే గడగడలాడించి ఉత్తమ పార్లమెంటేరియన్‌గా ఖ్యాతి గడించారన్నారు. సికిలే పుష్పకుమారి, సీపీఐ భీమవరం పట్టణ కార్యదర్శి చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాం ప్రసాద్, ఆకలి రాము పాల్గొన్నారు.

ప్రతి ఇంటా సంక్షేమ సంతకం

- నరసాపురంలో ముగిసిన గడపగడపకు మన ప్రభుత్వం
- 146 రోజులు..71,050 గడపలు
- సంక్షేమ పథకాలు అందాయని ముక్త కంఠంతో చెప్పిన లబ్ధిదారులు



హోరువానలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు(ఫైల్)

నరసాపురం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నరసాపురం నియోజకవర్గంలో విజయవంతంగా పూర్తయ్యింది. ప్రభుత్వ చీఫ్‌విప్, స్థానిక ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు ఓ యజ్ఞంలా కార్యక్రమాన్ని నడిపించారు. ఎండ, వర్షం, చలి దేనిని లెక్కచేయకుండా ప్రతీ గడపా తొక్కారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు వివరిస్తూనే మరోవైపు స్థానిక సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించే విధంగా అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. స్వయంగా ఎమ్మెల్యే తమ ప్రాంతానికి, తమ ఇంటికి వచ్చి సమస్యలు తెలుసుకుని పరిష్కరంచడంతో కార్యక్రమానికి నియోజకవర్గంలో విశేష స్పందన వచ్చింది.

146 రోజులు నిర్విరామంగా..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గడపగడపకూ కార్యక్రమం నిర్వహించాలని తలచిన వెంటనే ముదునూరి నియోజకవర్గంలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. నియోజకరవ్గంలో నరసాపురం మున్సిపాలిటీలో 30 వార్డులు, దీనితో పాటుగా నరసాపురం మండలంలో 28 పంచాయతీలు, మొగల్తూరు మండలంలో 17 పంచాయతీలు ఉన్నాయి. 146 రోజుల పాటు ముదునూరి మొత్తం నియోజకవర్గంలో ప్రతి ఇంటి గడప తొక్కారు. మొత్తం 59 సచివాలయాల పరిధిలో ఉన్న 71,050 కుటుంబాల వారితో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఏ కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఎంతమేర లబ్ధి చేకూరిందనే విషయాన్ని ప్రజలకు విపులంగా వివరించారు.

చేసింది.. చెప్పడమే కాకుండా

గడపగడపకూ కార్యక్రమంలో భాగంగా ముదునూరి కేవలం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు వివరించడంతోనే సరి పెట్టలేదు. సచివాలయ సిబ్బందితో సమీక్షలు నిర్వహించారు. ఒక్కో గ్రామంలో రాత్రంతా పల్లె నిద్రలు చేశారు. స్థానికంగా ప్రజల సమస్యలు, వార్డులు గ్రామాల్లో రోడ్లు తదితర సమస్యలు తెలుసుకుని నిధులు మంజూరు చేయించి, పనులు మొదలు పెట్టించారు. గడపగడపకూ కార్యక్రమంలో ప్రజల నుంచి 1627 ఫిర్యాదులు రాగా, వాటిలో 1329 సమస్యలకు పరిష్కారం చూపించారు. మిగిలినవి అప్పటికప్పుడు పరిష్కారమయ్యే సమస్యలు కాకపోవడంతో పెండింగ్‌లో ఉన్నాయి. గత నెలలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన రూ.3,300 కోట్లు ప్రాజెక్టులతో కలుపుకుని ముదునూరి మొత్తంగా గడపగడపకూ కార్యక్రమం సాగిస్తున్న కాలంలో నియోజకవర్గంలో సంక్షేమం, అబివృద్ధి కార్యక్రమాల మొత్తం రూ.4850 కోట్లు కావడం గమనార్హం.

రెండో రౌండ్‌కు ముదునూరి రెడీ..

నియోజకవర్గంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయ్యింది. కార్యక్రమం నూరు శాతం పూర్తయిన నియోజకవర్గాల్లో రాష్ట్రంలోనే మొదటిది నరసాపురం కావడం గమనార్హం. శనివారం లక్ష్మణేశ్వరం గ్రామంలో ముగింపు కార్యక్రమం అట్టహాసంగా వైఎస్సార్ సీపీ శ్రేణులు నిర్వహించాయి. మంత్రులు జోగి రమేష్, మేరుగ నాగార్జున తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఇదిలా ఉంటే రెండవ దఫా ప్రతీ గపడకూ తిరగడానికి ముదునూరి రెడీ అవుతున్నారు.

సీఎం జగన్ మాకు మంచి అవకాశం కల్పించారు



గడపగడపకు మన ప్రభుత్వం మంచి కార్యక్రమం. ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుంది. ప్రతీ ఇంటికీ వెళ్లి ప్రభుత్వం చేస్తున్న మంచి పనులు ప్రజలకు వివరించడం, వారి మాటల్లో వారి ఆనందాన్ని పంచుకోవడం మరుపురాని అనుభూతి. ప్రజలు మమ్మల్ని ఎన్నుకుని చట్టసభలకు పంపించారు. వారికోసం, వారి సంక్షేమ కోసం పనిచేయడం, వారి కష్టసుఖాలను నేరుగా తెలసుకోవడం గతంలో ఏ ప్రభుత్వం చేయలేదు. ప్రజలతో మమేకం అయ్యే అవకాశాన్ని ఈ కార్యక్రమంలో ద్వారా ముఖ్యమంత్రి మాకు కల్పించారు. దీనికి ఆయనకు ధన్యవాదాలు.

– ముదునూరి ప్రసాదరాజు,
ప్రభుత్వ చీఫ్‌విప్

11 నుంచి జగనన్న సంక్రాంతి సంబరాలు

మొగల్తూరు: ముత్యాలపల్లిలో ఈ నెల 11 నుంచి 13 వరకు జగనన్న సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నట్టు రాష్ట్ర వన్నెకుల సంక్షేమ సంఘం డైరక్టర్ బందన పూర్ణచంద్రరావు తెలిపారు. ఆదివారం ముత్యాలపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగనన్న సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఈ నెల 11 నుంచి 13 వరకూ జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు, 13 మధ్యాహ్నం గ్రామంలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తామన్నారు. వాలీబాల్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానం సాధించిన వారికి రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.6 వేలు అందిస్తామని, ముగ్గుల పోటీల్లో విజేతలకు ప్రథమ బహుమతి రూ.5 వేలు అందిస్తామన్నారు. గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు కొల్లాటి రామారావు, రేవు రాంబాబు, దొంగ యుగందర్, సాదనాల రామకృష్ణ, బర్రి సామోరు, కొపనాతి గంగాజలం నిర్వహణలో ఈ పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

మత్స్యకారుల ఉపాధిని కాపాడాలి

పెనుగొండ: ఇసుక ర్యాంపులతో మత్స్యకారుల ఉపాధి కోల్పోతున్నారని, సత్వరం మత్స్యకారుల ఉపాధిని కాపాడాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం వారు విలేకరుతో మాట్లాడుతూ సుమారు 500 కుటుంబాలు సిద్ధాంతం, దొంగరావిపాలెంల్లో మత్స్యవేటపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. ర్యాంపుల నిర్మాణాల వల్ల మత్స్య సంపద తగ్గిపోయి అవస్థలకు గురవుతున్నారని తెలిపారు, ప్రభుత్వం సత్వరం స్పందించాలని కోరారు. కార్యక్రమంలో నాగిశెట్టి గంగారావు, కర్రి కనకరాజు, మోకా సూర్య చంద్రరావు, వాతాడి అర్జునరావు, కర్రి కొండయ్య, రాంబాబు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ వాహనాలతో ఇబ్బందులు



రైల్వే స్టేషన్ రోడ్‌లో ఇరువైపులా నిలిపి ఉంచిన ప్రైవేట్ వాహనాలు

నరసాపురం: పట్టణంలోని రైల్వేస్టేషన్‌రోడ్‌లో ఇష్టానుసారం ప్రైయివేట్ వాహనాలు నిలిపి ఉంచడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. రైల్వేస్టేషన్‌రోడ్‌లో ఇటీవల కాలంలో రద్దీ బాగా పెరిగింది. పాలకొల్లు రోడ్ విపరీతమైన రద్దీతో ఉండటంతో, చాలా మంది ప్రత్యామ్నాయంగా, ఈ రోడ్‌లో ప్రయాణిస్తున్నారు. ఇటీవల స్టేషన్ పక్క నుంచి సరిపల్లి మీదుగా బైపాస్ కూడా నిర్మించారు. దీంతో రద్దీ బాగా పెరిగింది. అయితే ఈ రోడ్‌లో ప్రైవేట్ బస్సులు, రొయ్యల కంపెనీలకు సంబంధించిన ఇతర ప్రైవేట్ వాహనాలను ఇరువైపులా నిలిపి ఉంచుతున్నారు. బస్సులను కూడా ఇక్కడే కడగడంతో రోడ్డు పక్కన బురదమయంగా ఉంటుంది. దీంతో రోడ్ మార్జిన్‌లుకూడా పాడైపోతున్నాయి. ప్రైవేట్ బస్సులు నిలిపి ఉంచడానికి ప్రత్యేకంగా ఎక్కడైనా స్థలం కేటాయించాలిని, ఈరోడ్‌లో సమస్య పరిష్కారమయ్యేలా మున్సిపల్, పోలీస్ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకోవాలి



విశ్రాంత లెక్చరర్ డాక్టర్ రామ్మోహనరావును సత్కరిస్తున్న విశ్వతేజ కళాశాల పాలకవర్గం

పెనుగొండ: విద్యార్థి స్థాయి నుంచి వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకోవడం వల్ల ఉన్నత స్థాయికి చేరుకోవచ్చునని ఎస్వీకేపీ కళాశాల రిటైర్ట్ లెక్చరర్ డాక్టర్ రంకిరెడ్డి రామ్మోహనరావు అన్నారు. ఆదివారం పెనుగొండ విశ్వతేజలో నెహ్రూ యువకేంద్రం యువజన వ్యవహారాలు, కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ, వారధి సోషల్ ఆర్గనైజేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'నేడు యువతలోనాయకత్వ లక్షణాలు, సమాజ అభివృద్ధి' శిక్షణ తరగతుల్లో పాల్గొన్నారు. నెహ్రూ యువకేంద్ర జిల్లా యువ అధికారి దూలం కిషోర్ పాల్గొని యువత వారిలో నాయకత్వ లక్షణాలు అవర్చుకొనే విధానం, సమాజంలో ఎలా ప్రవర్తించాలో వివరించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఎం నాగబాబు, వారధి సోషల్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు కామాక్షీ రవి, కార్యదర్శి కడలి సత్యనారాయణ యోగా గురువు దంపనబోయిన మోహనకృష్ణ, నెహ్రూ యువకేంద్ర వలంటీర్లు ఝాన్సీ, వాసంతి, కుసుమ తదితరులు పాల్గొన్నారు.

భీమవరం మావుళ్లమ్మ సన్నిధికి పాదయాత్ర



పాదయాత్ర చేస్తున్న భక్తులతో కలిసి నడుస్తున్న జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాసు

పాలకొల్లు అర్బన్: మండలంలోని ఉల్లంపర్రు గ్రామంలో ఉన్న కనకదుర్గమ్మ ఆలయం నుంచి భీమవరం మావుళ్లమ్మ ఆలయానికి భక్తులు పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. ఆదివారం ఉదయం మాంటిస్సోరిస్ పాఠశాల అధినేత మద్దాల వాసు ఆధ్వర్యంలో, యడ్ల బజార్ శ్రీ కనకదుర్గమ్మ దేవస్థానం చైర్మన్ కావలి శ్రీనివాసరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ యాత్రకు జిల్లా పరిషత్ చైర్మన్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కవురు శ్రీనివాసు సంఘీభావం తెలుపుతూ కొద్ది దూరం భక్తులతో కలిచి నడిచారు. అనంతరం సాయంత్రం 5 గంటలకు భీమవరం మావుళ్లమ్మ సన్నిధికి చేరుకునఆరు. ఈ యాత్రలో సుమారు 250 మంది భక్తులు పాల్గొన్నారు. ఈ యాత్రలో దారి పొడవునా వడ్డే గని, పోశింశెట్టి శ్రీనివాసు, అల్లు శ్రీనివాసు, కావలి శ్రీనివాసులు సహాయ సహకారాలు అందించారు. రావాడ సతీష్, కఠారి నాగేంద్ర కుమార్, కానూరి శ్రీను, తటవర్తి సుధాకరరావు, రేవూరి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ పట్టణ అధ్యక్షుడిగా ప్రభాకరశాస్త్రి



పట్టణ శాఖ యుటిఎఫ్ నూతన కార్యవర్గం

పాలకొల్లు సెంట్రల్: పట్టణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) అధ్యక్షుడినిగా వై.ప్రభాకర శాస్త్రి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం రాత్రి స్థానిక ఎం.ఎం.కె.ఎన్ మునిసిపల్ ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ పట్టణ శాఖ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జరిగిన నూతన కార్యవర్గం ఎంపికలో వై.ప్రభాకరశాస్త్రిని రెండోసారి పట్టణ అధ్యక్షుడిగా ప్రకటించారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా కె.త్రినాథ్, గౌరవ అధ్యక్షుడిగా ఎస్.చిట్టిబాబు, కోశాధికారిగా ఎస్.రాంజీకుమార్, సహా అధ్యక్షులుగా జేజే దుర్గారావు, ఈ.శ్రీలక్ష్మీ ఎంపికయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర యూటీఎఫ్ కోశాధికారి బి.గోపిమూర్తి, జిల్లా అధ్యక్షుడు పి.విజయరామరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏకేవీ రామభద్రం, జి.లక్ష్మీనారాయణ, పి.క్రాంతికుమార్, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు ప్రారంభం

భీమవరం (ప్రకాశంచౌక్): శ్రీసద్గురు త్యాగరాజ స్వామి 104వ ఆరాధనోత్సవాల సందర్భంగా స్వామివారితో సంగీత నాద స్వర వాయిద్యాలతో త్యాగరాజ కీర్తనలతో నగర సంకీర్తన, సీతారామచంద్ర లక్ష్మణ, ఆంజనేయ, త్యాగరాజ స్వామి ఉత్సవ విగ్రహాలతో పల్లకిలో ఊరేగింపు నిర్వహించారు. తొలుత త్యాగరాజ భవనంలో నిర్వాహకులు సంగీత కళాకారులతో సంప్రదాయ పూజలు నిర్వహించారు. త్యాగరాజ మ్యూజిక్ అకాడమీ కార్యదర్శి, ఉపాధ్యక్షులు కారుమూరి ఆదిత్య, గన్నాబత్తుల శ్రీనివాస్ మాట్లాడుతూ త్యాగరాజ స్వామి 104వ ఆరాధనోత్సవాలను ఘనంగా ప్రారంభిస్తూ స్వామివారి శోభాయాత్ర నిర్వహించామని, 5 రోజులపాటు జరిగే ఈ కార్యక్రమాలకు బెంగళూరు, విశాఖపట్టణం, విజయవాడ, హైదరాబాద్ నుంచి విద్వాంసులు వస్తున్నారని అన్నారు. చెరుకువాడ సోదరులు వెంకట్రామయ్య, రంగసాయి మాట్లాడుతూ 1919లో ఈ ఉత్సవాలను గునుపూడి సర్వ ధర్మయ్య ప్రారంభించారని, అప్పటి నుంచి ఎందరో మహనీయులు సేవలందిస్తున్నారన్నారు.

వైభవంగా పల్లాలమ్మ జాతర



అలమూరులో పల్లాలమ్మ అమ్మవారి పూరిగుడి వద్ద నైవేద్యాలు చెల్లించేందుకు బారులు తీరిన మహిళలు



అలమూరులో పల్లాలమ్మను దర్శించుకుంటున్న మాజీ మంత్రి చెరుకువాడ శ్రీ రంగనాథరాజు

పెనుమంట్ర: అలమూరు గ్రామంలో శ్రీపల్లాలమ్మ అమ్మవారి దయతో ప్రజలంతా సుఖశాంతులతో జీవించేలా ఆశీర్వదించాలని మాజీ మంత్రి, ఆచంట శాసన సభ్యులు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. ఆదివారం శ్రీపల్లాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలను పురస్కరించుకుని ఆయన అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5 ఏళ్లకు ఒకసారి నిర్వహించే ఈ జాతర మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించడంపట్ల కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. జాతర సందర్భంగా దూరప్రాంతాల వచ్చిన బంధుమిత్రులతో ఆలమూరు గ్రామంలో సందడి నెలకొంది. ఆదివారం రాత్రి భారీ ఎత్తున వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయడంతో పరిసర గ్రామాల నుంచి వచ్చే రక్షణ కల్పించేందుకు 150 మంది సిబ్బందితో భారీ బందోబస్తు నిర్వహించారు. గ్రామానికి నలువైపులా పెద్ద ఎత్తున స్వాగత ద్వారాలు ఏర్పాటు చేసి గ్రామానికి అటు, ఇటు రెండు కిలోమీటర్ల మేర విద్యుత్ దీపాలు, అమ్మవార్ల కటౌట్ల అలంకరణలతో జాతర మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజుతో పాటు రాజమండ్రి రుడా చైర్ పర్సన్, వైఎస్సార్‌సీపీ ఆచంట నియోజకవర్గ పరిశీలకురాలు మేడపాటి షర్మిలారెడ్డి, రాష్ట్ర యోగా సంఘ అధ్యక్షుడు చెరుకువాడ నరేష్‌రాజు, పెనుమంట్ర ఎంపీపీ కర్రి వెంకటనారాయణరెడ్డి(వాసు), జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీసుభాషిణి, సర్పంచ్ మేడపురెడ్డి వెంకటరమణ, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు పెన్మెత్స విశ్వనాథరాజు, మాజీ సర్పంచ్ కొవ్వూరి సత్తిరెడ్డి, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు ద్వారంపూడి నారాయణరెడ్డి, గొట్టుముక్కల సత్యనారాయణరెడ్డి, పడాల బులిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్‌ను ఆశీర్వదిద్దాం

ఉండి: ఎన్నో సంక్షేమ కార్యక్రమాల ద్వారా బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదిద్దామని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి జీ సుందర్‌కుమార్ అన్నారు. ఆదివారం పింఛన్ వారోత్సవాల ముగింపు సందర్భంగా ఉణుదుర్రులో కొత్తగా పింఛను మంజూరైన పలువురు లబ్ధిదారులకు పింఛను సొమ్ము అందజేశారు. ఈ సందర్భంగా సుందర్‌కుమార్, పార్టీ గ్రామ అధ్యక్షుడు కూనపరాజు వర్మ తదితరులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించే పింఛన్ల ద్వారా ఎంతో మంది సంతోషంగా బతుకుతున్నారన్నారు. పింఛను తీసుకునే వృద్ధులు, అక్కాచెల్లెమ్మలు ముఖ్యమంత్రి తమ పెద్ద కొడుకు అంటూ ఆత్మీయంగా మాట్లాడుతున్నారన్నారు. ఏదైనా సంక్షేమ కార్యక్రమం చేస్తే దానికి పదింతలు ప్రచారం చేసుకునే రాజకీయ నాయకుల మాదిరి కాకుండా చెప్పింది చేస్తూ, చేస్తున్నదే చెబుతున్న నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్నారు. ఆయన పార్టీలో నాయకులుగా ఉండి ప్రజలకు సేవ చేయడం చాలా సంతోషంగా ఉందని వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. కూనపరాజు వర్మ, రెడ్డి కనకదుర్గ, పైలా సత్యనారాయణ, గెద్దం కాంతారావు, వలంటీర్లు పాల్గొన్నారు.

వాసవి క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం



వాసవి క్లబ్ నూతన కార్యవర్గంతో శేషుబాబు, తాతాజీలు

పాలకొల్లు సెంట్రల్: వాసవి ఇంటర్నేషనల్ సంస్థ దేశవ్యాప్తంగా పలు క్లబ్‌లు స్థాపించి కోట్లాది రూపాయలు విలువైన సేవా కార్యక్రమాలు అందిస్తుందని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ బోడా సూర్యప్రకాష్ తెలిపారు. ఆదివారం స్థానిక కంచర్ల పురుషోత్తం వాసవీ క్లబ్ కళ్యాణ మండపంలో క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూర్యప్రకాష్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించాలనే సంకల్పంతో సరస్వతి పథకం ఏర్పాటుచేసి ఎక్కువ మంది విద్యార్థులకు సహాయ సహకారాలు అందించాలనే సంకల్పించడం జరిగిందన్నారు. నూతన కార్యవర్గంలో అధ్యక్షునిగా ఇమ్మిడి రాజేష్, సెక్రటరీ పలివెల శివ, ట్రెజరర్ చవ్వా సతీష్ కుమార్‌లచే జిల్లా గవర్నర్ కొల్లేపర కృష్ణాజీ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మూడు కుట్టు మెషీన్లు, ముగ్గురు విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఇద్దరు విద్యార్థులకు సైకిళ్లు, సరస్వతి పథకానికి రూ. 25 వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ యడ్ల తాతాజీ, వాసవి క్లబ్ సభ్యులు బొండాడ భాస్కర్, గాదె జనార్ధన్ గుప్తా, శ్రికాకొల్లు మైధిలి, మాటూరి నరిసింహమూర్తి, రేపాక ప్రవీణ్ భాను, కారుమూరి శ్రీరాములు, కొండపల్లి మోహన్, పిరాట్ల శ్రీను, బోమగిరి రమేష్, పచ్చిగోళ్ల మూర్తి, ఎస్.కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

[illegible]

పెన్మెత్స శ్రీరాములు B.Com., B.L.

క్రైస్తవులంతా వైఎస్సార్ సీపీ వెన్నంటే



జాన్సన్‌కు శుభాకాంక్షలు చెబుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఉండి: ఎన్నికలు ఎప్పుడొచ్చినా క్రైస్తవులంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉంటారని రాష్ట్ర క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్రపాటి అనిత అన్నారు. ఇటీవల వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ అధ్యక్షుడిగా నియమితులైన మేడిది జాన్సన్‌కు పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, క్రైస్తవ నాయకులతో కలసి ఆమె ఆదివారం భీమవరంలో జాన్సన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉండిలో ఆమె మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా తెలుగు రాష్ట్రాల క్రైస్తవులకు అండగా, పెద్ద దిక్కుగా ఉంటున్న జాన్సన్‌ను క్రైస్తవులకు రాష్ట్రాధ్యక్షుడిగా నియమించిన ముఖ్యమంత్రికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. క్రైస్తవుల బలోపేతానికి వారి కోసం ప్రత్యేక పార్టీ సెల్‌ను ఏర్పాటు చేయడంతో క్రైస్తవులకు వైఎస్సార్ సీపీలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రత్యేక గుర్తింపునిచ్చారన్నారు. దీంతో రాష్ట్ర క్రైస్తవులంతా హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. గతంలో క్రైస్తవులకు ప్రత్యేక గుర్తింపు ఎవ్వరూ ఇవ్వలేదని, ఇప్పుడు ప్రత్యేకమైన శ్రద్ధతో క్రైస్తవులను గుర్తించిన ముఖ్యమంత్రికి రుణపడి ఉంటామన్నారు. క్రైస్తవుల సంక్షేమానికి పాటుపడుతున్న ముఖ్యమంత్రి రుణం తీర్చుకునేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామన్నారు. జాన్సన్ మార్గనిర్దేశంలో వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేస్తామన్నారు. ఎంపీటీసీ సభ్యుడు చిగురుపాటి క్రిస్టాఫర్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు బొడ్డు నాగన్న, పాలు, గాలి భూషణం, కృపారావు, ఈలి సాధు పాల్గొన్నారు.